సాక్షి
కాకినాడ
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



నిత్యాన్నదానానికి విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలాజీ నిత్యాన్నదానం ట్రస్టుకు కడలి కృష్ణమూర్తి, కాళికాదేవి దంపతుల స్మారకార్థం వారి కుమార్తెలు రూ.50,232 అందజేశారు.



రూ.60,500 సమర్పణ

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి ఎ.సాయిరామ్ దంపతులు (రాజానగరం మండలం ముక్కినాడ) సోమవారం రూ.60,500 సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: జిల్లాలో ఖాళీగా ఉన్న 4 అంగన్‌వాడీ కార్యకర్తలు, 26 సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. నియామకాల కమిటీ చైర్‌పర్సన్, కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కాకినాడ అర్బన్, తాళ్లరేవు, పెద్దాపురం, ప్రత్తిపాడు ప్రాజెక్టుల్లో ఒక్కొక్కటి చొప్పున కార్యకర్త పోస్టు, కాకినాడ అర్బన్‌లో 5, కాకినాడ రూరల్‌లో 4, తాళ్లరేవు 4, పిఠాపురం 6, తుని 4, జగ్గంపేట 3 చొప్పున మొత్తం 26 సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

స్పందనకు 403 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజలు 403 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీఓ పి.త్రినాథ్, డీపీఎ కె.భారతి సౌజన్య, కాకినాడ డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి అర్జీలు స్వీకరించారు. వీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రీ ఓపెన్ అయ్యే అర్జీల శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

16న మెగా జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 12 సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి దాదాపు వెయ్యి ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ ఉత్తీర్ణులైన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 0884-2373270 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆడుదాం ఆంధ్రా ఖోఖో పోటీల్లో ప్రతిభ



ఖోఖో పోటీల్లో తృతీయ స్థానం పొందిన కాకినాడ అర్బన్ క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విశాఖలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా ఖోఖో పోటీల్లో కాకినాడ అర్బన్ క్రీడాకారిణులు ప్రతిభ చూపారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ సోమవారం తెలిపారు. విజయనగరంపై 7-5 స్కోర్‌తో విజయం సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. బీసీ కాలనీ వార్డు-2 సచివాలయం పరిధిలోని రూరల్ నియోజకవర్గ మహిళలు ఈ ఘనత చాటారన్నారు. వీరి వెంట ఖోఖో కోచ్ వాసు, డీఐఓ ప్రసాద్, డీఎస్‌ఓ అప్పలనాయుడు ఉన్నారని శ్రీనివాస్‌కుమార్ తెలిపారు.

నరసన్న హుండీల రాబడి రూ.24,41,574



సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామివారికి భక్తుల నుంచి వివిధ హుండీల ద్వారా మొత్తం రూ.24,41,574 ఆదాయం వచ్చింది. సోమవారం ఆలయంలో కోనసీమ జిల్లా ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగ మల్లేశ్వరరావు, ఎండోమెంట్స్ ఈవో బి.వీర వెంకటేశ్వరరావుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కించారు. 38 రోజులకుగాను వచ్చిన పై మొత్తంలో మెయిన్ హుండీ, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.23,77,401, అన్నదానం హుండీ ద్వారా రూ.64,173 ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు పాల్గొన్నారు.



పశ్చిమ రాజగోపురం ముందు దేవస్థానం బస్సు కోసం ఎండలోనే ఎదురు చూస్తున్న భక్తులు



చెట్ల కింద సేద తీరుతున్న భక్తులు



ఈఓ కార్యాలయం ఎదుట పార్కింగ్ స్థలంలో కానరాని నీడ

నీడనివ్వు స్వామీ..



నిలువ నీడ లేక రత్నగిరిపై భక్తుల ఇక్కట్లు

- శిశిరంలోనే చుర్రుమంటున్న సూరీడు
- రత్నగిరిపై సేద తీరడానికి చెట్ల నీడలే గతి
- కానరాని షెల్టర్లు
- అల్లాడుతున్న సత్యదేవుని భక్తులు

అన్నవరం: ప్రస్తుతం ఇంకా శిశిర రుతువే.. నిన్న మొన్ననే ప్రారంభమైంది.. ఇది మళ్లాలి.. తర్వాత వసంతం వెళ్లాలి.. ఆపై నింగి నుంచి నిప్పులు కురిసే గ్రీష్మ రుతువు ప్రారంభమవుతుంది.. కానీ.. ఇప్పుడే గ్రీష్మం వచ్చేసినట్టు.. సూర్యుడు అప్పుడే ప్రతాపం చూపిస్తున్నాడు. వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. మధ్యాహ్నమైతే చాలు.. సూరీడు చుర్రుమంటున్నాడు. గాలి ఇంకా వేడెక్కక పోయినా.... ఉష్ణతాపం, కాసింత ఉక్కపోత వాతావరణం ఒంటికి తెలుస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో సత్యదేవుని సన్నిధికి తరలి వస్తున్న భక్తులు.. రత్నగిరిపై నీడ కానరాక అల్లాడుతున్నారు. ఈసారి గత ఏడాది కంటే ఎండలు అధికంగా ఉంటాయని, వేసవి కూడా ఎక్కువ కాలం కొనసాగే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో రత్నగిరిపై భక్తుల సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో షెల్టర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మాఘ మాసం ప్రారంభం కావడంతో అన్నవరం సత్యదేవుని ఆలయానికి భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారు. దీనికి తోడు వివాహ ముహూర్తాలు కూడా మొదలు కావడంతో స్వామి వారు వేంచేసిన రత్నగిరిపై వధూవరులు, పెళ్లిబృందాల సందడి కూడా ఆరంభమైంది. సరిగ్గా ఇదే సమయంలో సూర్య ప్రతాపం కూడా మొదలవడంతో కొండ పైకి వస్తున్న భక్తులు ఆపసోపాలు పడుతున్నారు. రత్నగిరిపై కీలకమైన ప్రదేశాల్లో నిలువ నీడ లేక.. ఎండను తట్టుకోలేక.. గత్యంతరం లేక.. వారు చెట్ల నీడలను ఆశ్రయిస్తున్నారు.

పశ్చిమ రాజగోపురం ఎదురుగా..



సత్యదేవుని సన్నిధిలో పశ్చిమ రాజగోపురం ఎదురుగా భక్తులకు ఎటువంటి నీడా లేదు. ఇక్కడ గతంలో 60 గదుల సత్యదేవ అతిథి గృహం ఉండేది. దీనిని గత అక్టోబర్‌లో తొలగించారు. అక్కడ సుమారు ఎకరం ఖాళీ స్థలం రావడంతో రాజగోపురానికి అడ్డం లేకుండా విశాలమైన షెడ్ నిర్మించడానికి అప్పటి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ప్రణాళిక రూపొందించారు. ఇక్కడ రూ.1.99 కోట్లు వ్యయంతో షెడ్ వేయడానికి లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ముందుకు వచ్చింది. అయితే గత ఏడాది నవంబర్ 13 నుంచి కార్తిక మాసం ప్రారంభం కావడం.. శాశ్వత షెడ్ నిర్మాణానికి సమయం లేకపోవడంతో.. తాత్కాలికంగా విశాలమైన షెడ్ నిర్మించారు. కార్తిక మాసం అనంతరం ఈ తాత్కాలిక షెడ్‌ను తొలగించడంతో భక్తులకు ఇబ్బందులు మొదలయ్యాయి.

ప్రస్తుతం పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశం పార్కింగ్ స్థలంగా మారింది. ఇక్కడ నీడ లేక, ఎండ నుంచి రక్షణకు ఎక్కడ నిలబడాలో తెలియక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దేవస్థానం బస్సులను కూడా ఇక్కడే నిలుపుతున్నారు. దీంతో ఇక్కడ ఉన్న చెట్ల నీడల్లోనే భక్తులు నిలుచోవాల్సి వస్తోంది. ఇక్కడ షెడ్ నిర్మించడానికి లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ సిద్ధంగా ఉంది. అయితే ముందుగా నిర్ణయించిన గ్యాలోరిమ్ టైల్స్ రూఫ్ షెడ్ కాకుండా క్లాత్‌తో వేసినట్టుగా కనిపించే టెన్సైల్ రూఫ్ షెడ్ వేయించేందుకు ప్రతిపాదన సిద్ధం చేశారు. ఇది ఇంతవరకూ కార్యరూపం దాల్చకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ షెడ్ వేసేంత వరకూ ఇక్కడ తాత్కాలికంగానైనా షెడ్ నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. ఇక్కడ వ్రతాలు, ప్రసాదం విక్రయాలకు వేసిన కౌంటర్లు సైతం నిరుపయోగంగా ఉన్నాయి. వాటిల్లో ఫ్యాన్లు బిగించి, భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

తూర్పు రాజగోపురానికి ఇరువైపులా..

తూర్పు రాజగోపురానికి ఇరువైపులా కూడా ఎటువంటి షెడ్లూ లేవు. సత్యదేవుని దర్శించుకున్న అనంతరం భక్తులు ఆలయం వెలుపలి ప్రాకారంలోకి చేరుకుంటారు. కానీ, అక్కడ ఎటువంటి నీడా లేదు. దీంతో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న రావి చెట్టు నీడలోనో లేక గోకులం వద్ద ఉన్న చెట్ల నీడలోనో సేద తీరాల్సిన దుస్థితిని భక్తులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నీడనిచ్చేందుకు షామియానాలు వేయించాలని భక్తులు కోరుతున్నారు.

ఈఓ కార్యాలయం ముందు..

దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) కార్యాలయం ముందున్న పార్కింగ్ ప్రదేశంలో కూడా ఎటువంటి నీడా లేదు. గతంలో ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్, దాని పక్కనే కాటేజీ, చెట్లు ఉండేవి. వాటిని గత అక్టోబర్‌లో కూల్చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఎటు చూసినా ఎండగానే ఉంటోంది. ఇక్కడ కూడా షామియానాలు, భక్తుల కాళ్లు కాలకుండా నేలపై కార్పెట్ వేయించాలని కోరుతున్నారు.

షామియానాలు వేయిస్తాం



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో, పార్కింగ్ స్థలాల్లో భక్తుల కోసం షామియానాలు వేయించాలని ఆదేశించాం. ఇప్పటికే క్యూ లైన్లపై షెల్టర్లు వేశారు. వారం రోజుల్లోనే మిగిలిన ప్రదేశాల్లో కూడా షామియానాలు వేయిస్తాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి రూ.10 లక్షల సహాయం

దాతృత్వాన్ని చాటుకున్న విద్యార్థులు



సేకరించిన రూ.10 లక్షలను విద్యార్థి తల్లిదండ్రులకు అందిస్తున్న ఎంఈఓలు

మామిడికుదురు: తమతో చదువుకున్న విద్యార్థికి కష్టం వచ్చిందని తెలిసిన సహచర విద్యార్థులు చలించిపోయారు. నగరంలోని ఎడ్యుకేర్‌లో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బళ్ల రామ్‌మోహన్ రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. కొన్ని రోజులుగా ప్రతి రెండు రోజులకు రామ్‌మోహన్‌కు డయాలసిస్ చేస్తున్నారు. డాక్టర్లు అతనికి కిడ్నీ మార్పిడి చేయాలన్నారు. దీనికి రూ.15 లక్షల ఖర్చు అవుతుందన్నారు. రామ్‌మోహన్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అతడి దుస్థితి చూసి చలించిపోయిన విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి రూ.10 లక్షలు సేకరించారు. ఆ మొత్తాన్ని విద్యాసంస్థల అధినేత కె.మురార్జీ.. ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు సమక్షంలో సోమవారం రామ్‌మోహన్ తల్లిదండ్రులకు అందజేశారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

- పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు
- భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



పిఠాపురంలో నీటిని తొలగించిన తర్వాత పాదగయ పుష్కరిణి

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో త్వరలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. పాదగయ క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి అధికారులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా గత రెండు రోజులుగా పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగించారు. పుష్కరిణి చుట్టూ ఉన్న ఇనుప గ్రిల్స్‌ను శుభ్రం చేయడంతో పాటు రంగులు వేస్తున్నారు. పుష్కరిణి చుట్టూ మెట్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. మహా శివరాత్రి ఉత్సవాలకు పుష్కరిణిని సిద్ధం చేసి కొత్త నీరు ఏర్పాటు చేస్తామని నారాయణమూర్తి తెలిపారు.

అధికారులతో సమీక్ష

మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులతో ఈఓ నారాయణ మూర్తి సమీక్షించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, వైద్యం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాదగయ పుష్కరిణిని పూర్తిగా శుభ్రం చేసి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినపుడు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి వాటిలో కూడా మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయడంపై దృష్టి సారించామన్నారు. ఉత్సవాల ప్రారంభం నుంచి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గతంలో కంటే భక్తులు అధికంగా తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఆలయానికి రంగులు వేయడంతో పాటు చలువ పందిర్లు, విద్యుద్దీపాలంకరణ పనులు ప్రారంభించామన్నారు. త్వరలో ఉత్సవాలకు పందిరి రాట వేస్తామని తెలిపారు.



పాదగయ క్షేత్రం వెలుపల స్వాగత ద్వారం వద్ద విద్యుద్దీపాలంకరణకు ఏర్పాట్లు

చురుగ్గా వసంత మంటపం పునర్నిర్మాణం

సఖినేటిపల్లి: అంతర్వేదిలో వసంత మంటపం పునర్నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఏటా లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పౌర్ణమి రోజున సముద్ర స్నానం అనంతరం స్వామి వసంత మంటపంలో సేద తీరడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో ఇక్కడ నిర్మించిన మంటపం శిథిల స్థితికి చేరుకోవడంతో మంటపం పునర్నిర్మాణ పనులను రూ.18 లక్షలతో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ నుంచి మొదలయ్యే స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 24వ తేదీన నిర్వహించే చక్రవారీ సముద్ర స్నానం (పౌర్ణమి స్నానాలు) రోజుకు ముందుగా మంటపం పూర్తి చేసేలా పనులను వేగవంతం చేశారు.

నేడు విఘ్నేశ్వరునికి సప్తనదీ జలాభిషేకం



సప్తనదీ జలాలతో ఆలయ సిబ్బంది

అయినవిల్లి: శ్రీ పంచమి సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గణపతి కల్పం ప్రారంభంతో సప్తనదీ జలాభిషేక సహిత లక్ష కలాల వితరణ మహోత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 15వ తేదీ వరకూ ఈ మహాక్రతువులు నిర్వహించడానికి సర్వం సిద్ధమైనట్లు చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి నదుల నుంచి ఆలయ అధికారులు జలాలు సేకరించారు. వాటిని భక్తుల దర్శనం కోసం ఆలయ మంటపంలో ఉంచారు. జలాభిషేకం అనంతరం స్వామివారి పాదాలకు లక్ష కలాలతో పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులచే సరస్వతీ పూజలు చేయించనున్నారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు.

ఏలేరు ఆయకట్టుకు 1,100 క్యూసెక్కులు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయం నుంచి ఆయకట్టుకు 1,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రబీ సాగు అవసరాల దృష్ట్యా నీటి విడుదలను పెంచారు. విశాఖకు 150, పంపాకు 50, తిమ్మరాజు చెరువుకు 75 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, సోమవారం 76.73 మీటర్లుగా నమోదైంది. జలాశయం పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, 9.17 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి.

వ్రత పురోహితులకు తీపి కబురు

- పారితోషికం నెలకు రూ.5 వేల పెంపు
- 254 మందికి లబ్ధి
- ఈ నెల నుంచే అమలు



దేవస్థానంలో సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 254 మంది వ్రత పురోహితుల పారితోషికాన్ని నెలకు రూ.5 వేలు పెంచుతూ ఈఓ కె.రామచంద్ర మోహన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దేవస్థానం వ్రత విభాగంలోని పురోహితులకు వ్రతాల ఆదాయంలో 40 శాతం పారితోషికంగా చెల్లిస్తున్నారు. పురోహితులకు వారి గ్రేడ్‌లను అనుసరించి ప్రతి నెలా రూ.31 వేల నుంచి రూ.40 వేల వరకూ ఈవిధంగా చెల్లిస్తున్నారు. మిగిలిన పారితోషికం మొత్తాన్ని ఏడాది చివరన ఎరియర్స్ రూపంలో చెల్లిస్తున్నారు. ఇలా ఎరియర్స్ రూపంలో ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ. 80 వేల వరకూ వస్తోంది. వ్రత పురోహితులు ఈ విషయాన్ని వివరిస్తూ తమకు ఎరియర్స్ రూపంలో చెల్లిస్తున్న మొత్తం నుంచి ప్రతి నెలా రూ.5 వేలు అదనంగా చెల్లించాలని, అనంతరం మిగిలిన మొత్తాన్ని ఏడాది చివరిలో ఎరియర్స్ రూపంలో చెల్లించాలని ఇటీవల కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఈఓ ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పారితోషికం పెంపుదల ఈ నెల నుంచే అమలులోకి రానుంది. వచ్చే నెల పారితోషికంలో రూ.5 వేలు కలిపి చెల్లించనున్నారు. ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్ పురోహితులు 12 మందికి రూ.40 వేలు, మొదటి గ్రేడ్‌లోని 48 మందికి రూ.37 వేలు, రెండో గ్రేడ్‌లోని వంద మందికి రూ.35 వేలు, మూడో గ్రేడ్‌లోని 94 మందికి రూ.31 వేలు చొప్పున ప్రస్తుతం ప్రతి నెలా పారితోషికం చెల్లిస్తున్నారు. వీరందరికీ పారితోషికం వచ్చే నెల నుంచి రూ.5 వేల చొప్పున పెరగనుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పురోహితుల సంక్షేమానికి పెద్దపీట

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత వ్రత పురోహితుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంది.
- 2020, 22 సంవత్సరాల్లో సుమారు 60 వ్రత పురోహిత పోస్టులను రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేశారు.
- అప్పటి వరకూ వ్రతాల ఆదాయంలో చెల్లిస్తున్న 30 శాతం పారితోషికాన్ని 40 శాతానికి పెంచుతూ 2022 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 20 సంవత్సరాల తరువాత ఈవిధంగా పారితోషికం పెంచడంపై పురోహితులు హర్షం వ్యక్తం చేశారు. దీనివలన ఒక్కో వ్రత పురోహితుడికి నెలకు రూ.5 వేల వరకూ పారితోషికం పెరిగింది.
- విశ్రాంత వ్రత పురోహితులకు వారి సర్వీసును అనుసరించి ఏడాదికి రూ.10 వేల చొప్పున గ్రాట్యుటీ కూడా చెల్లించారు. దీనివలన ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.3.5 లక్షల వరకూ లబ్ధి చేకూరింది.
- ఇప్పుడు తాజాగా మళ్లీ పురోహితుల పారితోషికాన్ని నెలకు రూ.5 వేల చొప్పున పెంచడం గమనార్హం.
- దీంతోపాటు 56 మంది విశ్రాంత వ్రత పురోహితుల పెన్షన్‌ను రూ.500 పెంచుతూ కూడా ఈఓ ఆదేశాలిచ్చారు.

కృతజ్ఞతలు



వ్రత పురోహితుల పారితోషికాన్ని నెలకు రూ.5 వేలు పెంచుతూ ఆదేశాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రతిపాదనకు సహకరించిన దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్‌లకు పురోహితులందరి తరఫున కృతజ్ఞతలు.

– చామర్తి కన్నబాబు, కల్యాణబ్రహ్మ, వైదిక కమిటీ సభ్యుడు, అన్నవరం దేవస్థానం

పురోహితుల కోరిక మేరకే..

వ్రత పురోహితులు తమ పారితోషికం ఎరియర్స్ మొత్తం నుంచి ప్రతి నెలా రూ.5 వేల చొప్పున నెలవారీ పారితోషికంతో కలిపి చెల్లించాలని కోరారు. దీనివలన దేవస్థానంపై ఎటువంటి ఆర్థిక భారం పడదు. ఆ మేరకు ఆదేశాలిచ్చాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

క్లుప్తంగా

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


రైలు పట్టాల మధ్యలో మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైలు పట్టాల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. రైల్వే ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం.. వేట్లపాలెం శివారు ప్రాంతం గూడపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో ఆఫ్‌లైన్, డౌన్‌లైన్ ట్రాక్ మధ్యలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ట్రాక్‌మెన్ బి.గంగాధర్ గుర్తించి స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఎస్ పి.అనంత లక్ష్మి సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు షార్టు మాత్రమే ఉంది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వివరాలకు 94406 27562 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

గొల్లప్రోలుపై అభివృద్ధి జల్లు

- ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపిన ప్రభుత్వం
- రూ. 99.06 కోట్లతో నగర పంచాయతీలో పనులు



గొల్లప్రోలులో నిర్మిస్తున్న జగనన్న కాలనీ

పిఠాపురం: గొల్లప్రోలు పంచాయతీ నగర పంచాయతీగా 2011లో మారింది. పిఠాపురం నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యం గల పంచాయతీగా పేరుంది. వ్యాపారాలకు వ్యాపారస్తులకు నిలయంగా ఉండే గొల్లప్రోలు నగర పంచాయతీ పిఠాపురం నియోజకవర్గంలో వ్యాపార కేంద్రంగాను, వ్యాపారాలకు కేంద్ర బిందువుగాను ఉంది. వాణిజ్య పంటలు పండే మెట్ట ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో ఇక్కడ వాణిజ్య పంటల వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయి. రాజకీయంగాను మంచి పట్టున్న నేతలు ఉండడంతో నియోజకవర్గంలో కీలక పంచాయతీగా ఉంటోంది.

వ్యాపారాలకు పుట్టినిల్లు

ఇక్కడ చేయని వ్యాపారం అంటు ఉండదు. ప్రతీ ఇంట్లోను ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేస్తుంటారు. ముఖ్యంగా కారం, వేరుశనగ, మినప, పెసర, కందులు, ఎండుమిర్చి, బియ్యం, తవుడు, ప్రత్తి, దూది తదితర మిల్లులు ఉన్నాయి. కూరగాయల వ్యాపారాల్లో ఆరితేరిన గ్రామంగా పేరుంది. ఇక్కడి నుంచి కరోనా సమయంలో కూరగాయలు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి. ఎక్కువగా ఎండుమిర్చి, ప్రత్తి, పప్పుదినుసులు, చింతపండు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. ప్రత్తితో తయారు చేసే వత్తులు, కారం, పసుపు, వేరుశనగ గుళ్లు, చింతపండు ఇక్కడ తయారు చేసి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. సైకిళ్లు, మోటారు సైకిళ్లపై ఇంటింటికీ తిరుగుతూ అమ్మకాలు జరిపే వ్యాపారస్తులు ఎక్కువ మంది ఉన్నారు. నగర పంచాయతీలో నిత్యం రూ.60 లక్షల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. సుమారు 30 వేల మంది చిరు వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్నారు.

ఏళ్ల సమస్యకు పరిష్కారం

ఇక్కడ ప్రధాన సమస్యగా ఉండే సూరంపాలెం దారికి మోక్షం కల్పించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు చొరవతో రూ.20 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తయ్యాక అప్రోచ్ రోడ్లు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నగర పంచాయతీ నడిబొడ్డున అత్యంత ప్రాధాన్యం గల మొగలి సూరీడు చెరువును అమృత్ పథకంలో అభివృద్ధి చేస్తున్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో ఇప్పటి వరకు ఇబ్బందిగా ఉన్న రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.

నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి

గొల్లప్రోలు నగర పంచాయతీలో తొమ్మిది పాఠశాలల్లో రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏడు ప్రాథమిక పాఠశాలలను రూ.2.36 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధికి నోచుకోని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతో పాటు నూతన భవనాలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, ఆట స్థలాల అభివృద్ధి చేసి ఆట పరికరాలు ఏర్పాటు చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణంతో వైద్య సదుపాయాలు మెరుగు

గొల్లప్రోలు నగర పంచాయతీ ప్రజలకు స్థానికంగా ఉండే పీహెచ్‌సీ మాత్రమే వైద్య సేవలు అందించేది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సేవలు మాత్రం పెరగలేదు. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వైద్య శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలతో ఒక్కసారిగా వైద్య సేవలు మెరుగుపడ్డాయి. పెరుగుతున్న ప్రజలందరికీ వైద్యం అందుబాటులో ఉండే విధంగా రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారు. దానికి అనుగుణంగా వైద్య సిబ్బందిని నియమించారు. ఇప్పటి వరకు అద్దె భవనంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ సొంత భవనంలోకి మారనుంది. అర్బన్ హెల్త్ సెంటర్ అభివృద్ధితో అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సేవలు అందుతున్నాయి. అధునాతన వైద్య పరీక్షలు ఉచితంగా పేద ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.


అర్బన్ హెల్త్ సెంటర్


అభివృద్ధి చేసిన జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల


అభివృద్ధి చేసిన మొగలి సూరీడు చెరువు

విస్తీర్ణం– 12 చదరపు కిలోమీటర్లు
జనాభా – 23,882, స్త్రీలు 11,811, పురుషులు 12,071
వార్డులు – 20, వలంటీర్లు– 120 మంది, సచివాలయాలు 7, సచివాలయ సిబ్బంది 63
నగర పంచాయతీ సిబ్బంది 18 మంది, పారిశుద్ధ్య సిబ్బంది 46 మంది,
స్లమ్ ఏరియాలు 30, వాటర్ పైపు లైన్లు 105 కిలోమీటర్లు
ఓటర్లు 20,109 మంది, పురుషులు 10,068, స్త్రీలు 10,040, హిజ్రాలు ఒకరు
పాఠశాలలు 9, హైస్కూళ్లు 2, ప్రాథమిక పాఠశాలలు 7, జూనియర్ కాలేజీ 1

అభివృద్ధి పనులు - నిధులు

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ : రూ.80 లక్షలు
14వ ఆర్థిక సంఘం నుంచి : రూ.4.10 కోట్లు
జగనన్న నగర బాటలు : రూ.6.30 లక్షలు
గడపగడపకూ మన ప్రభుత్వం : రూ.1.60 కోట్లు
15వ ఆర్థిక సంఘం నుంచి : రూ.3.94 కోట్లు
ఎంపీ లాడ్స్ : రూ.42 లక్షలు
ఏఐఐబీ నిధులు : రూ.87.14 కోట్లు
అమృత పథకం : రూ.99 లక్షలు
జగనన్న ఇళ్ల పట్టాలు : 2,100 మందికి
నాడు–నేడు పాఠశాలల అభివృద్ధి : రూ.2.36 కోట్లతో

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి



నేను పదవీ బాధ్యతలు చేపట్టే నాటికి గొల్లప్రోలు నగర పంచాయతీ అనేక సమస్యలతో ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కావాల్సిన నిధులు మంజూరు చేయడంతో నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. సూరంపాలెం కాలనీకి వెళ్లే మార్గాన్ని అనుసంధానం చేస్తూ రూ.20 లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టాం. దీని అప్రోచ్ రోడ్డుకు మరో రూ.20 లక్షలు ఖర్చు అవుతుంది. ఈ విషయాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయి. రెండు శ్మశాన వాటికలకు, ప్రభుత్వ బాలుర హైస్కూల్‌కు కాంపౌండ్ వాల్ నిర్మించాం.

– గంద్రేటి మంగతాయారు, చైర్‌పర్సన్, గొల్లప్రోలు నగర పంచాయతీ

మరింత అభివృద్ధి చేస్తాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రెట్టింపు చేయడంతో మరిన్ని రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి కానున్నాయి. నగర పంచాయతీ కార్యాలయానికి నూతన భవన నిర్మించేందుకు కృషి చేస్తున్నాం. మరిన్ని నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో రానున్న కాలంలో నగర పంచాయతీ మరింత అభివృద్ధి సాధించనుంది. కొన్నేళ్లుగా ఏ ప్రభుత్వం నగర పంచాయతీలో ఏ ఒక్కరికి ఇంటి స్థలం ఇవ్వలేక పోయింది. సీఎం వైఎస్ జగన్ చొరవతో 2,100 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాం. దీంతో ఒక కొత్త నగర పంచాయతీ ఏర్పడింది.

– పెండెం దొరబాబు, ఎమ్మెల్యే, పిఠాపురం

సీఎం వైఎస్ జగన్ సహకారంతో ప్రగతి



ఎంపీ లాడ్స్ నిధులు రూ.42 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం. ఏఐఐబీ నిధులు రూ. 87.14 కోట్లు వెచ్చించి మంచి నీటి సమస్యకు పరిష్కారం చూపిస్తున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి నీరు గొల్లప్రోలు ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. గొల్లప్రోలు సూరంపాలెం వాసుల చిరకాల ఆశయం అయిన ఆర్‌యూబీ నిర్మాణానికి నిధులు విడుదల కానున్నాయి. ఇప్పటికే ఉన్నతాధికారులు స్థల పరిశీలన చేశారు. త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. గొల్లప్రోలును మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాను.

– వంగా గీత,
కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

రెండు నెలల క్రితం వదిలేసి వెళ్లిన వైనం

ఈ కారు ఎవరిదో?


హుకుంపేట ఆదర్శనగర్‌లో రెండునెలల క్రితం వదిలేసి వెళ్లిన కారు

రాజమహేంద్రవరం రూరల్: రెండు నెలల క్రితం ఒక ఇంటి ముందు కారును పార్కు చేసి వెళ్లిన వ్యక్తి ఇప్పటివరకు రాకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడైనా కారును దొంగిలించుకుని వచ్చి ఇక్కడ వదిలేశారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్‌లో వీధిలో విశ్రాంత ప్రభుత్వ వైద్యులు డాక్టర్ విజయకుమార్ ఇంటి ముందు రోడ్డుపై మారుతి సుజుకి ఎర్టిగాకారును ఒక వ్యక్తి గత ఏడాది డిసెంబర్ మూడవవారంలో వదిలేసి వెళ్లిపోయాడు. వెనుక వేరే వ్యక్తి బైక్‌పై రావడంతో అది ఎక్కి వెళ్లిపోయాడని స్థానికులు చెబుతున్నారు. కారు అక్కడ ఉంచి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఎవరూ తీసుకువెళ్లకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయి. ఈ కారు నంబరును బట్టి ఏలూరు ఆర్‌టీవో రిజిస్ట్రేషన్ కల్గి నూజీవీడుకు చెందిన ఎం.ఫణీందర్‌గా చూపిస్తోంది. పోలీసులు ఈ కారు మిస్టరీని ఛేదించి యజమానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పట్ట పగలే చోరీకి యత్నం

దొంగను పోలీసులకు అప్పగించిన స్థానికులు


చోరీకి యత్నం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పిఠాపురం: తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసుకున్నాడు. ఎవరూ లేరని నిర్ధారించుకుని చోరీకి ప్రయత్నించాడు. చివరకు స్థానికుల చేతికి చిక్కి పోలీస్టేషన్‌కు చేరి ఊచలు లెక్కపెడుతున్నాడు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేబ్రోలు హరేరామ గుడి దగ్గరలో నివాసముంటున్న బొమ్మిడాల కామేశ్వరరావు తాపీ పని చేస్తుంటాడు. ఎప్పటి లాగే అతను సోమవారం ఉదయం తాపీ పనికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న అతని భార్య వంట పని పూర్తి చేసుకుని మధ్యాహ్నం తన భర్త వచ్చేలోపు తిరిగి వద్దామని, ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో ఉన్న తన అమ్మవారింటికి వెళ్లింది. ఒక వ్యక్తి ఇదంతా గమనించి ఆమె బయటకు వెళ్లగానే ఇంటి దగ్గరకు వెళ్లి ముందుగా కిటికీ తలుపులు తెరవడానికి ప్రయత్నించాడు. అవి రాకపోవడంతో ఇంటికి వేసి ఉన్న తాళాలను ఇనుప ఊచతో పగులగొట్టడానికి ప్రయత్నించాడు. ఇంతలో కుక్కలు అరుస్తుండడంతో అనుమానం వచ్చిన పక్కింటి వారు ఈ ఇంటివైపు చూడగా దొంగ తాళాలు పగులకొడుతూ కనిపించాడు. దీంతో వాళ్లు గట్టిగా దొంగ దొంగ అంటూ అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. గొల్లప్రోలు పోలీసులు వచ్చి అతనిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీటి వీడ్కోలు

- ముగిసిన విద్యార్థుల అంత్యక్రియలు
- శోక సంద్రంగా రంపయర్రంపాలెం
- బరువెక్కిన హృదయాలతో అంతిమయాత్ర


కాకర్ల వీరవెంకట అర్జున్ అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులు, గ్రామస్తులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థుల అంత్యక్రియలు సోమవారం గ్రామంలో ముగిశాయి. గ్రామానికి చెందిన కాకర్ల వీరవెంకటఅర్జున్, లావేటి రాంజీ, అన్నిబోయిన దేవీచరణ్ ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఐ.పోలవరంలోని వాగులో పడి మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మృతదేహాలు గ్రామానికి చేరుకోవడంతో ఒక్కసారిగా గ్రామస్తుల గుండెలు బరువెక్కాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమారులు విగతజీవులుగా తిరిగి రావడంతో వారి పార్థివ శరీరాల వద్ద కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. తమ తోటి మిత్రుల కడచూపు కోసం విద్యార్థులు తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం గ్రామస్తులు వారి ముగ్గురికి కన్నీటితో అంతిమయాత్ర నిర్వహించి బరువెక్కిన హృదయాలతో గ్రామ శివారున ఉన్న శ్మశానవాటికలో ఒకేచోట అంత్యక్రియలు జరిపారు. మరణంలోను వీడని వారి స్నేహబంధాన్ని చూసి గ్రామస్తులు చలించారు. అంతకు ముందు మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారి మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రవికుమార్ మృతదేహం

దేవరపల్లి: మండలంలోని చిన్నాయగూడెంలో కొమరపు రవికుమార్(34) ఆదివారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో ఇంటిలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 6వ తేదీన మృతుడు రవికుమార్, సోదరుడు లాలా మధ్య గొడవ జరిగింది. రవికుమార్‌ను సోదరుడు లాలా కుర్చీతో కొట్టడంతో గాయపడ్డాడు. గాయాలకు నాలుగు కట్లు వేశారు. అప్పటి నుంచి రవికుమార్ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో రవికుమార్ మృతి చెందాడు. దీనిపై భార్య సుధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ జరపగా అన్నదమ్ముల మధ్య జరిగిన కొట్లాటలో రవికుమార్ స్వల్పంగా గాయపడినప్పటికీ చనిపోయే అంతగా దెబ్బలు లేవని ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. అయితే మృతుడు రవికుమార్ ఎక్కువగా మద్యం సేవిస్తాడని, చుట్టుపక్కలవారు చెప్పారని ఆయన తెలిపారు. నాలుగు రోజుల నుంచి ఎటువంటి ఆహారం తీసుకోకుండా మద్యం సేవించినట్టు ఆయన తెలిపారు. భార్య సుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణానికి రాట ముహూర్తం


రాట ముహూర్తంలో పాల్గొన్న అర్చకులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరుని దివ్య కల్యాణానికి సోమవారం రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో డోలు సన్నాయి మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది.

సముద్రంలో బోటు దగ్ధం

రూ.20 లక్షల నష్టం



సముద్రంలో దగ్ధం అవుతున్న బోటు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన బోటులో ప్రమాదవశాత్తూ ఇంజన్‌కు మంటలు అంటుకోవడంతో సోమవారం బోటు పూర్తిగా దగ్ధం అయ్యింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు సురక్షితంగా మరో బోటులోకి చేరుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పాడ శివారు సూరాడపేటకు చెందిన సూరాడ రమణ బోటుపై సోమవారం తెల్లవారుఝామున 11మంది మత్స్యకారులు అమీనాబాదు హార్బర్ నుంచి వేటకు వెళ్లారు. సాయంత్రం 4గంటల సమయంలో సముద్రంలో వేట సాగిస్తుండగా ఒక్కసారిగా ఇంజన్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో మత్స్యకారులు భయపడ్డారు. కోస్టుగార్డు సిబ్బంది సహాయంతో సమీపంలో వేట సాగిస్తున్న సూరాడ కృష్ణ బోటుపై సురక్షితంగా 11మంది చేరుకున్నారు. అప్పటికే స్వల్ప గాయాలైన మత్స్యకారులకు కోస్టుగార్డు సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఈ ప్రమాదంలో బోటు, వలలు కలిసి సుమారు రూ.20 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

హత్య కేసులో తల్లీకొడుకులకు జీవిత ఖైదు

కాకినాడ లీగల్: స్థలం సరిహద్దు గొడవలో ఒకరిని హత్యచేసి మరో ఒకరిపై హత్యాయత్నం చేసిన కేసులో ఒక్కొక్కరికి జీవిత ఖైదు, రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాజులూరు మండలం ఆర్యావటం గ్రామంలో నివసిస్తున్న వంక నాగ వెంకట సత్యవతి, ఆమె కుమారుడు వంక శ్రీనివాస్ కలిసి పక్కన నివసిస్తున్న పితాని రామచంద్రరావు, అతని భార్య పితాని మోహన కుసుమ నాగ కుమారితో స్థలం సరిహద్దు విషయంలో 2008 సంవత్సరం నుంచి గొడవ పడుతున్నారు. 2016 ఆగస్టు 23వ తేదీన పితాని రామచంద్రరావు, అతని భార్య పితాని మోహన కుసుమ నాగకుమారిని చంపేయమని వంక నాగ వెంకట సత్యవతి చెప్పడంతో ఆమె కుమారుడు వంక శ్రీనివాస్ వారి ఇద్దరిపై హాకీ బ్యాట్‌తో దాడి చేశాడు. పితాని రామచంద్రరావు మృతిచెందగా, భార్య పిమోహన కుసుమ నాగ కుమారి తీవ్ర గాయాల పాలైంది. దీనిపై గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో వంక శ్రీనివాస్, వంక నాగ వెంకట సత్యవతిపై నేరం రుజువు కావడంతో హత్య చేసినందుకు ఒక్కొక్కరికి జీవిత ఖైదు శిక్ష, రూ. పదివేలు చొప్పున జరిమానా, హత్యాయత్నం చేసినందుకు ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష ,రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలూ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఏపీపీ కె.ఆదిత్యకుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

లారీ దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చాగల్లు: గ్రామ శివారు డిస్కవరీ ఫ్యాక్టరీ సర్వీసింగ్ సెంటర్ వద్ద ద్రాక్ష సరఫరా చేసే ఖాళీ ట్రైలర్ లారీ షార్ట్ సర్క్యూట్ వల్ల సోమవారం దగ్ధమైంది. ఆ ప్రమాదం సర్వీసింగ్ సెంటర్ సమీపంలో జరగడంతో పెను ప్రమాదం తప్పింది.

మంటలు అంటుకోగానే సర్వీసింగ్ సిబ్బంది అప్రమత్తమై మంటలు ఆర్పి వేశారు. స్థానికులు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న కొవ్వూరు అగ్నిమాపక అధికారి ఏవీఎస్ఎన్ వేణు, సిబ్బంది పూర్తిగా కాలకుండా నిలుపుదల చేశారు. ఐసర్ లారీ యజమాని, చాగల్లు గ్రామానికి చెందిన తోట శ్రీనివాస్ మాట్లాడుతూ అందులో లారీకి సంబంధిత రికార్డులు ఉన్నాయని తెలిపారు.